వనితాలోకం :

ఆమె-లోకం

వాసిరెడ్డి సీతాదేవి

ఉషాదేవి తన మేలిముసుగు కొంచెం తొలగించి పల్లెపాలెం ప్రజలను పలకరించింది. ఆమె ఆరక్తకపోలాల అరుణిమతో తూర్పుదిక్కున ఆకాశం రాగరంజితమైంది ఉత్తరాన రంయిన పరుగెత్తుకొస్తున్న కారుమబ్బులు, వినీలాకాశాన్ని అలుముకొంటున్న అరుణిమను - ముత్తైదువ నొసటి కుంకుమను చెరిపే కబంధుని కఠోర హస్తంలా కప్పి వేస్తున్నాయి! ఆకాశంలో ఏదో తెలియని వెలితి ద్యోతకమౌతూంది. ప్రపంచానికి వెలుగును ప్రసాదించే సూర్యభగవానుని, రాహువు తన చీకటి నీడల్ని పరచి, యింకొంచెం సేపట్లో మింగేయటానికి ఉద్యుక్తుడవుతున్నాడు.

ఊళ్లో అన్నిటికంటే ఎత్తుగా వున్న భవనం పైనున్న గూటిలోంచి వో, కపోతాల జంటలేచి, గాలిలో 'టపటప' రెక్కలు ఆడించుకొంటూ రివ్వున ఆకాశంలోకి లేచిపోయినై.

ఆ భవనంలో మొదటి అంతస్తులో దక్షిణపు గదిముందు మాధవయ్య ఆందోళనగా అటూ యిటూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ తిరుగుతున్నాడు. ఆయన ముఖంలో ఏదో వూహించలేని భయ చిహ్నాలు, ఆనంద హాసరేఖలు, వొకదానిపై వొకటి గజిబిజిగా అలుముకుంటున్నాయి

గదిలోంచి మూలుగు వినిపిస్తోంది! ఎడంగా బల్లమీద కూర్చున్న పురోహితుడు త్రిపురయ్యగారి కళ్లలోకి మాధవయ్యగారు ఆదుర్దాగా చూశారు. పురోహితుడు చేతిలో పంచాంగాన్ని తెరచిచూసి, గోడమీది గడియారంవైపు వోసారి చూసి అన్నాడు.—

"ఇప్పుడే సూర్యగ్రహణంపట్టింది! సూర్యభగవానుణ్ని రాహువు మింగేశాడు!"

"ఇంకెంత సేపటికి?" దీర్ఘనిశ్వాసం విడిచాడు మాధవయ్య.

"ఇంకా ఏడునిముషాలకు సూర్యభగవానుడు విముక్తుడవుతాడు!" అన్నాడు పంచాంగం మడిచి పక్కన పెట్టుకుంటూ పురోహితుడు.

"దీనివల్ల దోషం." మాధవయ్య గొంతులో ఏదో అడ్డుపడింది.

"ఉంటే ఏం? దానికితగ్గ శాంతిలేదూ?" అన్నాడు త్రిపురయ్య ధీమాగా.

మాధవయ్య భయం, రాహువు సూర్యుడ్ని మింగేసి తన కడుపులోనే పెట్టుకొని పారిపోతాడని కాదు. భార్య శాంతమ్మ గర్భస్థ శిశువు ఏ ప్రమాదం లేకుండా వెలుగును చూస్తుందా అని!

నుదుటిమీద స్వేదబిందువుల్ని పైపంచతో అద్దుకుంటూ పట్టుతప్పిపోతున్న కాళ్లను నిలదొక్కుకుంటూ, హృదయ స్పందనాన్ని అణుచుకుంటూ, గది ద్వారానికి దగ్గరగా వచ్చి నుంచున్నాడు.

పురిటింట్లోనుంచి 'గణగణ' వెండి పళ్లెం మోత వినపడింది.

'కేర్ కేర్' మని శిశు రోదనం!

మాధవయ్య హృదయం ఆనందపు వెల్లువయింది. అతని హృదయాంతరాళాల్లో చెలరేగిన గిలిగింతలు, మాధవయ్య ముఖంలోకి కొత్త వెలుగులను తెచ్చాయి.'

పురోహితుడు త్రిపురయ్య లేచి నుంచొని రెండు చేతులు పైకెత్తి నమస్కరించి మంత్రోచ్ఛారణ చేసి, మాధవయ్య వైపు తిరిగి అన్నాడు—"సూర్యభగవానుడికి విముక్తి కలిగింది!"

"అవును! విముక్తి కలిగింది" మాధవయ్య తేలికపడ్డ హృదయంతో అన్నాడు.

అవును! విముక్తి కలిగింది తన భార్య, బిడ్డ, గండం గడిచి బయటపడ్డారు - మనసులోనే అనుకున్నాడు మాధవయ్య.

పురిటిగది తలుపులు తెరచుకున్నై. వేడిగాలీ, వాసనా బయటికొచ్చినై.

మాధవయ్య మేనత్త బయటికొచ్చి అంది "ఒరే! మాధవుడూ! కూతురు పుట్టిందిరా, కూతురు! బంగారు బొమ్మ!"

మాధవయ్య ఆనందంతో పరవశుడైనాడు. ముగ్గురు మొగపిల్లల తరువాత ఆడపిల్ల పుట్టింది.

"అత్తయ్యా!" అన్నాడు ఆనందంతో వణికే గొంతుతో మాధవయ్య లోపల కెళ్లి భార్య ముఖంలోకి చూశాడు అలసివున్న ఆమె కళ్లలో, ముఖంలో ప్రశాంతత, పెదవులపై సిగ్గుతో కూడిన చిరునవ్వు తొణికిసలాడినై.

భార్య పక్కలోవున్న పసిబిడ్డను మాధవయ్య ఆప్యాయంగా చూసుకొన్నాడు.

* * *

మాధవయ్య దంపతులు కూతురుకు ఇరవైఒకటో రోజున ఉయ్యాల కట్టి, 'జానకి' అని పేరు పెట్టుకున్నారు.

జానకి బారసాల బ్రహ్మాండంగా జరిపించాడు మాధవయ్య దాదాపు ఓ వెయ్యి రూపాయలు ఖర్చు చేశాడు.

జానకికి జరగని ముద్దుముచ్చట లేదు. ఆమె అన్నలు కూడ ఆమెను ఎంతో ప్రేమగా చూసుకొనేవారు.

జానకి వయసుతోపాటు యింట్లో ఖర్చు కూడా పెరిగింది. ఊళ్లోకి వచ్చిన ప్రతి మంచి గుడ్డా కొని ముందు కూతురుకి కుట్టించేది శాంతమ్మ.

ఊళ్లోకి రామశాస్త్రి గారొచ్చి సంస్కృతం బడి పెడితే మాధవయ్య జానకిక్కి సంస్కృతం చెప్పించాడు.

సంవత్సరం తిరక్కుండే సంగీతం మాష్టరు చలపతి వూళ్ళోకి వచ్చాడు. ఆ సంగీతం మాష్టర్ని ఇంటికి పిలిపించి జానకిక్కి సంగీతం చెప్పించింది తల్లి.

ఇలా జానకిక్కి ఏ చదువూ పూర్తిగా వంటపట్టకపోయినా శాంతమ్మకి కూతుర్ని వూళ్లో ఆడపిల్లలందరికన్నా ముందు నిల్చోపెట్టిందన్న ఘనత దక్కింది!

చూస్తుండగానే యిట్టే కాలం దొర్లిపోయింది.

జానకికి పద్ధానుగో సంవత్సరం వచ్చింది. పచ్చటి శరీరచ్ఛాయ, కోలమొహం, వెలుగులు చిందే విశాలమైన కళ్ళూ, తుమ్మెద బారుల్లా నల్లని నొక్కుల జుత్తూ, హాసరేఖలను పొదివి పట్టుకున్నట్లుండే ఆ పెదవులూ, యవ్వనపు మిసమిసల్ని మెరిపించే ఆ చెక్కిళ్ళూ, వయ్యారాన్ని వలకబోసే ఆ నడకా...నిజంగా ఒక్కమాటలో చెప్పాలంటే జానకి ప్రబంధనాయికలా వుండేది

మాధవయ్య కూతురు పెండ్లి ప్రయత్నాలు చెయ్యసాగాడు. మంచి సంబంధం కోసం గాలింపు మొదలు పెట్టాడు.

అప్పటికే మాధవయ్య తన పెద్దకొడుక్కూ, రెండో కొడుక్కూ పెళ్లిళ్లు చేశాడు. పోతే మూడో కొడుకు యింకా పట్నంలో చదువుకుంటూనే వున్నాడు.

పెద్దకొడుకు సుబ్బారాయుడుకి ఇద్దరు పిల్లలు. రెండో కొడుకు రామదాసు పట్టి వెర్రివెంగళాయి. అయితే పెళ్లాంమాత్రం గడుసు మనిషి.

మాధవయ్య పెద్దకొడుకుల పెళ్ళిళ్లకూ, చిన్నకొడుకు చదువుకూ; కూతురు అచ్చట్లు ముచ్చట్లకు బాగా ఖర్చుచేశాడు నిలవ డబ్బు అయిపోవటమే కాకుండా, ఏడెనిమిది ఎకరాల పొలం, అమ్మటంకూడా జరిగింది. పోతే యిరవై ఎకరాల పొలం, ఆ యిల్లూ, కొద్దో గొప్పో అప్పూ మిగిలివున్నాయి

ఇంట్లో జానకి నగలకూ, గుడ్డలకూ వాటికి అయే ఖర్చు చూసి కోడళ్లు సణగటం మొదలు పెట్టారు. కాని శాంతమ్మ యివి ఏవీ

ఖాతరు చేసేదికాదు. కూతురు విషయంలో మాధవయ్యకు శాంతమ్మ ఎంత చెప్పితే అంత. ఒక్కగానొక్క ఆడపిల్లాయె! అసలు కూతురు నడిస్తే కాళ్లెక్కడ అరిగిపోతయో అనుకొనేవాడు మాధవయ్య.

జానకి మాటకు ఆ యింట్లో ఎదురులేదు. ఆపూట కేవి కావాలన్నా అప్పటికప్పుడు ఇంట్లోకివచ్చి పడాల్సిందే.

"ఎంత. వుంటేమాత్రం ఇంత గారాబమా?" అంటూ యిరుగు పొరుగు అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకునేవారు.

ఇంటికోడళ్లు కాంతమ్మ, కమలమ్మలు యిక సరేసరి!

"ఈ చోద్యం భూమ్మీద ఎక్కడా చూడలేదమ్మ!" అంటూ గోజుతు నాలుగు పొర్లన్నా జానకిని చూసి మెటికలు విరుచుకొనేవారు.

ఆరోజు సాయంకాలం కనుచీకటి పడుతోంది. మాధవయ్య అప్పుడు వూరినుంచి వచ్చి, వసారాలో మంచం వాల్చుకు కూర్చున్నాడు. భార్య శాంతమ్మ వుత్సాహంగా భ[ర్త]ను సమీపించి అన్నది.

"ఏమం[డీ]. ఏమయింది?"

"ఆఁ ఏమౌతుంది? తలకు మించినపని" అన్నాడు మాధవయ్య భార్యచేతి మంచినీళ్ళ గ్లాసును అందుకుంటూ.

"అంటే?"

"ఆఁ. అంతకట్నం మనం పోయలేం!"

మాధవయ్య గటగటా మంచినీళ్లు తాగి గ్లాసు కిందపెట్టి పైపంచతో ముఖం తుడుచుకున్నాడు.

"ఇంతకీ పిల్లడ్ని చూశారా?"

"ఆఁ చూశాను. పిల్లడికేం బాగానే వుంటాడు."

"బియ్యే పాసయాడటగా?"

"అవును. బి. ఏ. ఏంఖర్మం. యీ సంవత్సరంతో యమ్. ఏ. కూడా పూర్తవుతుందట!"

"అయితే ఇంకేం? సంశయిస్తారెందుకూ? అమ్మాయిని అతనికే యిద్దాం!"

మౌనంగా భార్య ముఖంలోకి చూశాడు మాధవయ్య.

"ఇదిగో! చూడండీ! వాళ్లది జమీందారీ ఫాయాటగా? నిజమేనా?" ఇంతింత కళ్లు చేసుకొని అడిగింది శాంతమ్మ.

"అంతా నిజమేలే! కాని సెంటుభూమి లేదు. అతడి పేరున చదువుకు చేసిన కొద్దో గొప్పో అప్పుకూడ వుందని వినికిడి." అన్నాడు మాధవయ్య ఏదో ఆలోచిస్తూ.

"అంత చదువుకున్నాడుగదా? రేపు ఏ కలెక్టరో అయితే యీ అప్పొగిప్పొ నోటెక్క, జమా! చూడండీ! ఇంకో సంగతి. వాళ్ల బంధువుల్లో వో ముసలమ్మ వదెకరాలకు పైగావున్న ఆస్తి యీ అబ్బాయికే యిస్తుందటగా?"

"ఇస్తుందటలే! కాని ఇప్పుడు పదివేల కట్నం మనం ఎక్కడ తెచ్చియిస్తాం?"

"పదివేలే!" గుడ్లు తేలేసింది శాంతమ్మ.

"సరే! నీళ్లుతోడు!" అన్నాడు మాధవయ్య చొక్కా విప్పుతూ.

తలుపుచాటుననించొని తల్లీతండ్రిసంభాషణ విన్న జానకిమనసులో—ఎం. ఏ. చదివి కలెక్టరు కాబోయే మొగుడూ, పదివేల కట్నం గజిబిజిగా యుద్ధం చేశాయి.

మాధవయ్యకు అన్నం వడ్డించి శాంతమ్మ వంటింటిగుమ్మానికి అనుకూర్చుని సంభాషణ ప్రారంభించింది.

"ఏమండీ! ఏమంటారూ?" అన్నది.

"ఏమిటి అనేది?"అన్నాడు మాధవయ్య.

"నాకు షుమ్మాటికీ ఆసంబంధంనచ్చింది"

"నచ్చటానికేం! నాకూ నచ్చింది. కాని పదివేలు ఎక్కడ తెచ్చి...."

"ఉన్నదాంట్లోనే ఏ పదిమంది ఆడపిల్లలున్నారు గనకా? వొక్కగానొక్క ఆడపిల! అయినా మీదంతా ఛాదస్తం! రేపు ఏ కలెక్టరో కాబోయేవాడు పదివేలు కట్నమన్నా తీసుకోకుండా పెళ్ళెట్లా చేసుకుంటాడేం?"

"అవును. ఆమాటా నిజమే"అనుకున్నాడు మాధవయ్య. "ఆరు నూరయినా నూరు ఆరయినా అమ్మాయిని ఆఅబ్బాయికి యివ్వాల్సిందే!' అంది శాంతమ్మ మొండిగా, భర్త కంచంలో మజ్జిగపోస్తూ.

"సరే, నీయిష్టం?" అన్నాడు మాధవయ్య.

"మనఅమ్మాయి అదృష్టవంతురాలు అన్నది శాంతమ్మ.

పడమటింట్లోనుంచి ఆ మాటలు విన్న జానకి ఆనందంతో వుక్కిరి బిక్కిరి అయింది.

వంటిల్లు సర్దటానికి వచ్చిన పెద్దకోడలు "పదివేలే? పదివేలు కట్నమా?" అని గుండెలు బాదుకుంది. వెంటనే ఆ వార్త తోటి కోడలు కమల చెవులో వూదింది.

ఆ రాత్రి కమల తన వెర్రిబాగుల భర్తకు నూరిపోసింది.

పెద్దకోడలు కాంతమ్మ ఆ వార్తయితే చెప్పింది కాని యింకేమీ అనలేక పోయింది. ఆవిడకు భర్తంటే చచ్చేభయం. పైగా సుబ్బారాయుడు తొణకని మనిషి. చెల్లెలంటే మహా యిష్టం.

మాధవయ్య ఐదెకరాల పొలం బేరం పెట్టాడు. ఇంట్లో కలకలం బయలుదేరింది. కోడళ్ళలో అలజడి సాగింది.

కొడుకులలో అశాంతి పొడచూపింది.

ఆ రాత్రి కాంతమ్మ అన్నం తినలేదు. పిల్లల్ని చావబాదింది. కొకిమీద పిల్లిమీద పెట్టి అత్తమామలను ఆడిపోసుకుంది.

రెండో కోడలు కమల తను తినలేదు సరిగదా భర్తకూడ అన్నం పెట్టలేదు.

"నా పిల్లలనోట్లో మట్టికొడతాడు మీ నాయన!" కసిగా అన్నది కాంతమ్మ.

"నోర్ముయ్" అన్నాడు సుబ్బారాయుడు. అన్నాడే కాని అతని హృదయంలో కల్గిన అశాంతిని అణచుకోలేక పోయాడు.

కేశవర్ధని తో
కేశాలను వృద్ధి చేసుకోండి
చుండును పోగొట్టండి. ఇక తలలో దురద ఎందుకుండాలి? వెంట్రుకలు ఎందుకు రాలిపోవాయి? పసితనంలో నెరియుట మాన్పండి. నెరియుటం ఆలస్యం కానివ్వండి.

కేశవర్ధనితో కేశాలకు పునర్జీవంపోసి, అందం చేకూర్చండి.
షాంపూ వాడి కేశ శుభ్రత, సువాసన పొందండి.
కేశవర్ధని అ. 14; షాంపూ అ. 14, పోస్టేజి అదనం. అన్నిచోట్లా లభించును.
కేశవర్ధని ప్రాడక్ట్సు, కోయంబతూరు.
నేషనల్ సేల్సు & సర్వీసెస్ (సదరన్) లిమిటెడ్. బకింగ్‌హాంపేట, బెజవాడ.
No 3

★ ఆమె - లోకం ★

"మీ అయ్య నిన్ను సన్యాసిని చేస్తాడు!" అన్నది కమల భర్తతో.

రామదాసు బిత్తరపోయాడు.

"ధైర్యంవుంటే నీది నువ్వు పంచియివ్వమని అడుగు!" మొగుడ్ని హెచ్చరించింది కమల.

"అడుగుతాలే" అన్నాడు రామదాసు.

జానకి పెళ్లి నిశ్చయమయింది. పొలం బేరం పైసలయింది. పొలం పోబోతున్న పెద్దకొడుకుని చూసి అన్నాడు తండ్రి.

"దస్తా వేజుమీద సంతకం పెట్టాలి. మధ్యాన్నం రిజిష్టారాఫీసు దగ్గరకు రా." అని.

వినపడ్డా వినబడనట్టే సుబ్బారాయుడు అరకకట్టాడు.

"నీకేరా! చెప్పేది?" అన్నాడు తండ్రి.

"వస్తాలే!" సణిగాడు కొడుకు.



ఇండియాలో తయారుచేయబడినది

L. 251-X52 TL

అన్నం తిని మహాలక్ష్మమ్మ చెట్టుకింద నీడ్లో పేక క్లబ్బుకు పోబోతున్న రామదాసుని చూసి అన్నాడు తండ్రి – "ఓరేయ్! నువ్వు కూడ మధ్యాన్నానికి ఆటురా!" అని.

"ఎందుకూ?" అన్నాడు రామదాసు, టెక్కు శంకరయ్యలా ముఖం పెట్టి.

"ఎందు కేమిటిరా నీ మొహం! దస్తావేజుమీద సంతకం పెట్టాలి!" అన్నాడు తండ్రి.

"నేను పెట్టను. ముందు నా దివాను పంచూ!" అన్నాడు వల్లించిన పాఠం అప్పచెబుతున్నట్లు.

తండ్రి విస్తుపోయాడు! తెల్లబోయి అరక ముందు అట్లాగే నిలబడిపోయాడు సుబ్బారాయుడు. కిటికీలోనుంచి చూస్తున్న కమల తన భర్త ప్రయోజకత్వానికి మురిసిపోయింది.

ఆ రోజే పట్నంనుంచి వచ్చిన మూడో కొడుకు సత్యం అరుగుమీద కూర్చొని జరుగుతున్నదంతా చూస్తున్నాడు.

"ఏమిటన్నయ్యా పంచేది? నీకు మతిపోతూంది" అన్నాడు సత్యం.

"ఇల్లు ఇల్లూ దోచి పెడుతుంటే చూస్తూ కూర్చోమంటావేం? నీకు పెళ్లామా బిడ్డలా?" అన్నాడు రామదాసు కోపంగా.

సత్యం ఉద్రేకంతో లేచి నిల్చున్నాడు. తండ్రివంక చూస్తూ అన్నాడు. "అయితే పంచు నాన్నా, జానక్కి కూడా ఒక భాగం. అదీ మాలాగనే పుట్టింది! ఆడవాళ్లకు ఆస్తిలో భాగం లేకపోవటం వల్లనే యీ కష్టాల......"

"వూరుకో చిన్నన్నయ్యా!" అంది వాకిట్లోనించొని చూస్తోన్న జానకి.

అంతా వొక్కసారి జానకివైపు చూశారు. చెల్లాయి ముఖం చూసేప్పటికి రామదాసు మనసు వెన్నపూసలా కరిగిపోయింది.

"ఏవిటర్రా అదీ!" అంటూ తల్లి వచ్చింది.

"ఏం లేదులే అమ్మా! ఆఫీసుదగ్గర కేనా? వస్తాలే నాన్నా!" అంటూ రామదాసు గబగబ వెళ్ళిపోయాడు.

2

జానకి పెళ్లయింది.

మాధవయ్య కూతురు పెళ్లి చాలా పెద్దత్తునే చేశాడు. అల్లుడికి పదివేలు కట్నం యిచ్చాడు. ఇంకో ఐదారు వేలదాకా పెళ్లి ఖర్చులకయినై.

పెళ్లికి వచ్చినవాళ్లు వెంకట్రావును చూసి, అతని చదువూ వంశగౌరవం అంతా విని జానకి అదృష్టవంతురాలన్నారు.

"నా కూతురుకంటే అదృష్టవంతురాలెవరున్నారు?" అనుకుంది శాంతమ్మ.

శాంతమ్మ కోడళ్లు జానకి అదృష్టాన్ని చూసి ఈర్ష్యపడ్డారు. అప్పగింతలనాడు శాంతమ్మ జానకిని వెంకట్రావుచేతులో పెట్టి గోడుగోడున ఏడ్చింది. మాధవయ్య ఓమూల కూర్చుని పైపంచతో కళ్లొత్తుకున్నాడు.

భర్త చేయి పుచ్చుకొని గడపదాటి పోతూ జానకి తల్లిని కౌగలించుకుని బావురుమని ఏడ్చింది. తండ్రి కాళ్లకు చుట్టుకొని కన్నీటితో తడిపివేసింది. కూతుర్ని లేవదీస్తున్న ఆ తండ్రి హృదయం తరుక్కుపోయింది.

మాధవయ్య అల్లుడి కళ్లలోకి దీనంగా చూశాడు. ఆ చూపులతో – 'నా బిడ్డ భారం నీదే. నాచిటితల్లిని ఎలా చూస్తావో?' అని ప్రార్థించాడు. జన్మలో మాధవయ్య ఎవర్నీ అంతదీనంగా ప్రార్థించివుండడేమో!

కంటిరెప్పలా కాపాడి పెంచిన తల్లినీ, తండ్రినీ, అన్నయ్యనూ పుట్టి పెరిగిన యింటిని వదిలిపెట్టే బాధలో – తను సాగించబోయే కొత్త జీవితం – సంసారం – భర్త మీద అల్లుకొన్న చిన్నచిన్న చిలిపివూహాల ఆనందంలో మునిగి జానకి ఏకలెక్చరు పెళ్లాన్నయాననే ఆనందంతో అత్తవారింటికి వెళ్లింది.

3

జానకి జీవితం భర్తతో మొదటిసంవత్సరం ఆనందంగా గడిచిపోయింది.

ఏకలెక్చరో అవుతాననుకొన్న భర్త విశాఖపట్నంలో కాలేజీ లెక్చరర్ అయేసరికి జానక్కి కొంత నిస్పృహకలిగినమాట వాస్తవమే. కాని ఆ నిస్పృహ ఎంతోకాలం వుండలేదు.

చీకూ చింతా లేకుండా జానకి జీవితం విశాఖపట్నంలో హాయిగా గడిచిపోతూంది. వెంకట్రావుకు ఆమె అంటే ఎంతో ప్రేమ; ఆమెతోడిదేలోకం.

ఇంట్లో పనిమనుషులూ, వంటమనిషీ వున్నారు. జానక్కి కాలుకదపాల్సినఅవసరం లేదు. సాయంకాలం బీచి షికారు. వారానికి రెండురోజులుసినిమా. ఇంట్లో రేడియో.

అంతకంటే తనకు కావల్సిందేమిటి? నిజంగానే తను అదృష్టవంతురాలననుకుంది జానకి.

తల్లీ తండ్రీ అప్పుడప్పుడూవచ్చి చూసిపోతుండేవాళ్లు. కూతురిసంసారాన్ని చూసి సంతోషపడేవారు. జానిక్కి ఇది తరుగు అన్నదిలేకుండా గడిచిపోతూంది.

ఒకరోజు రాత్రి జానకిభర్త చెవిలో వో చిలిపివార్త వూదింది.

వెంకట్రావుకి చక్కిలిగింతలు పెట్టినట్లయింది. ఆనందపరవశత్వంతో జానకిని అమాంతం కౌగలించుకున్నాడు.

వెంకట్రావు తెల్లవారి మామకు వుత్తరం రాశాడు – జానక్కి మూడోనెల అని.

అనేకరకాలపండ్లు మిఠాయిలతో జానకి తల్లి విశాఖపట్నంవచ్చి వాలింది. రెండు నెలలు కూతురుకు తోడుగా అక్కడేవుంది.

ఆరోనెల రాకముందే జానకిని తల్లి పుట్టింటికి తీసుకొచ్చింది.

జానకి ప్రసవించింది. ఆడపిల్లను కన్నది.

వెంకట్రావు భార్యను, పిల్లను చూట్టానికొచ్చాడు. కూతుర్ని చూసి సంబరపడ్డాడు.

జానకి భర్తముఖంలోకి దిగులుగా చూస్తూ అంది – "బాగా చిక్కిపోయారు. వంట్లో బాగుండటం లేదా? హోటలుభోజనం పడటంలేదా?" అని.

నవ్వేసి వూరుకున్నాడు వెంకట్రావు.

పుట్టింట్లోవున్న జానకికి భర్తనుగురించే దిగులు పెట్టుకుంది. మూడోనెలరాగానే బిడ్డనెత్తుకొని విశాఖపట్నం వెళ్లింది. తండ్రి కూడావచ్చి కూతుర్ని అల్లుడింట్లో దిగబెట్టి వెళ్లిపోయాడు.

ఆరునెలలు గడిచిపోయినై.

జానకి కూతురు తప్పటడుగులేస్తూ, పడుతూ లేస్తూ లేచి నించోటం మొదలుపెట్టింది.

వెంకట్రావు ఎప్పుడూ ఆ కూతుర్ని భుజంమీదనుంచి దించేవాడు కాదు. ఆ కూతురుమీదే అన్ని ఆశలూ, మనుకోరాలు పెట్టుకున్నట్లుండేవాడు.

"మా పార్వతిని బాగా చదివించి డాక్టరమ్మను చేస్తాను." అంటూ కూతుర్ని చాతిపైన దొర్లించుకునేవాడు.

ఇది వింటున్న జానకి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ మురిసిపోయేది.

వెంకట్రావు ఆరోగ్యం క్షీణించటం మొదలుపెట్టింది. చిక్కి శల్యమైపోతున్నాడు. అప్పుడప్పుడు రాత్రిళ్లు కళ్లుకళ్లున దగ్గుకూడ వస్తోంది.

"ఏవండీ! అలా చూస్తూ వూరుకుంటే ఎలా? ఎవరికైనా మంచి డాక్టరుకు చూపించకూడదూ?" అన్నది జానకి భర్తతో.

వెంకట్రావును పరీక్షచేసి డాక్టరు ఎక్స్-రే తీయాలన్నాడు. పరీక్షచేసి అన్నాడు డాక్టరు:– "ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. వ్యాధి బాగా ముదిరిపోయింది. ఆరునెల్లపాటు విశ్రాంతి తీసుకోవాలి."

ఆదుర్దాగా వెంకట్రావు డాక్టరు కళ్లలోకి చూశాడు. డాక్టరు క్షయవ్యాధి అని నిర్ధారణచేసి చెప్పాడు.

ఇప్పుడే వెలువడింది!
కథాసాగరం - 12
రావూరి భరద్వాజ కథలు
120 పేజీలు: రూపాయి
దేశికవితా మండలి, విజయవాడ-2

★ ఆమె - లోకం ★

జానకి కాళ్లక్రింద భూమి కరుగుతున్నట్లయింది. భర్తను కౌగలించుకొని భోరున ఏడ్చింది. వెంకట్రావు కుమిలి కుమిలి ఏడ్చాడు.

జానకి తండ్రికి వుత్తరం రాసింది.

"మీ అల్లుడికి. ఏం రాయమంటారు. చేతులు వణుకుతున్నాయి నాన్నా! అమ్మను తీసుకుని వొకసారి రండి!"

మూడో రోజుకల్లా మాధవయ్య భార్యతో సహా విశాఖపట్నం వచ్చిపడ్డారు ఆదుర్దాగా

అల్లుడి వ్యాధివిషయం విని మాధవయ్య స్తంభించిపోయాడు. శాంతమ్మ కూతుర్ని కౌగిలించుకొని పెద్దపెట్టున ఏడ్చింది

అప్పటికే వెంకట్రావు తరపు బలగమంతా వచ్చి దిగారు. జానకి పెద్దన్న సుబ్బారాయుడు వచ్చి చెల్లెల్ని పలకరించి వెళ్లాడు

చిన్నన్న సత్యం అంటే జానకికి అమిత ప్రేమ. సత్యమూ జానకంటే అలానే వుండేవాడు. అతనికి వుత్తరం రాయాలంటే అతని జాడే తెలియదు. చదువు మానేసి రాజకీయాల్లో తిరుగుతున్నాడని తెలిసింది

వెంకట్రావుకు జబ్బు చేసిన తరువాత మూడు నెలల్లో, మందులకూ మాకులకూ, డాక్టర్లకూ, ఇంట్లో వచ్చిపోయేవాళ్లకూ, ఎంత ఖర్చు అయిందో చెప్పటానికి వీల్లేదు

శాంతమ్మ తన పెద్దగొలుసు అమ్మి రహస్యంగా అల్లుడిచేతికిచ్చింది

వెంకట్రావుని గాలిమార్పుకు మదనపల్లి తీసుకువెళ్లమన్నారు డాక్టర్లు

"తొందర్లో మదనపల్లి వెళితే మంచిది కాదండీ?" అన్నది జానకి భర్తతో.

"మంచిదే. కాని డబ్బు దీనికి చాలా కావాలి" అన్నాడు వెంకట్రావు.

ఆమాటే జానకి తల్లితో అన్నది

శాంతమ్మ భర్తను కదిలించింది

మాధవయ్య ఆ సాయంకాలమే యింటికి ప్రయాణమైపోయాడు

4

"ఏరా!" అన్నాడు మాధవయ్య

"నాదగ్గరెక్కడుంది?" అన్నాడు పెద్దకొడుకు సుబ్బారాయుడు

"నా కొప్పుదాసే" మాధవయ్య కోపంగా అన్నాడు

"నీ కొచ్చేది యింతవరకు అనుకున్నావుగా!" అన్నాడు [illegible] రాము డాసు.

"అంతేనా?" నిర్ఘాంతపోయాడు తండ్రి. తన కొడుకులు తన పెద్దను తిరిగారు!

"అయితే. ఆ మూర్చ పొలం ఎకరం రాతిక అమ్మకో మిగతది ఎవరిది వారికి తెగతెంపులు చేయి" అన్నాడు పెద్దకొడుకు.

మాధవయ్య కొడుకులకు భాగాలు పంచాడు తన భాగంగా మాధవయ్య వో యకరం రాతిక మాగాణి మాత్రం తీసుకున్నాడు.

పొలం అమ్మి డబ్బు తీసుకెళ్ళి కూతురు చేతిలో పోశాడు మాధవయ్య.

వెంకట్రావు మదనపల్లి ప్రయాణమయాడు జానకి, మాధవయ్య, శాంతమ్మలు వెంకట్రావును శానిటోరియంలో చేర్చి యింటికి బయలుదేరారు

జానకి చంకలోని పసిపాప 'నాన్నా.' అంటూ చేతులు చాపింది

కూతుర్ని చేతుల్లోకి తీసుకొని జలజలా అశ్రువులు రాల్చాడు వెంకట్రావు

"నా చిట్టితల్లీ! నిన్ను డాక్టర్ చేయాలనుకున్నానమ్మా!" అన్నాడు

జానకి వలవలా ఏడ్చింది. "ముందు మీరు బాగా నయంచేసుకోండి! తరువాత అమ్మాయిని డాక్టరు చేద్దురుగాని" అన్నది జానకి

జానకి భర్తను వదిలి వచ్చేప్పుడు దారి పొడుగునా కుమిలి కుమిలి ఏడ్చింది. జానకి కూతురితో పుట్టింటికి చేరింది.

మాధవయ్య కుటుంబ పరిస్థితులు మారాయి జానక్కు ఆ యింట్లో యిదివరకున్న స్థానం యిప్పుడు లేదు. ఆ మాటకొస్తే మాధవయ్యకే లేదు.

ఇంట్లో పెత్తనం పెద్దకోడలు కాంతమ్మదే. సుబ్బారాయుడు పల్లెటూరి పిల్లబిగువుమీద భార్యను అదుపులో పెట్టే రోజులు పోయినై

అల్లుడికివ్వగా మిగిలిన డబ్బుతో మాధవయ్య సంసారాన్ని లాక్కొస్తున్నాడు

జానకి భర్త ఆరోగ్యం నయమవుతుందనే కొండంత ఆశ పెట్టుకొని కాలం దొర్లించుకొస్తోంది. తొందర్లో నయమయిపోతాడు, మళ్ళీ వుద్యోగంలో ప్రవేశిస్తే హాయిగా విశాఖపట్నంలో వుండొచ్చు. కూతురికి చదువుకొచ్చే యీడొచ్చేసరికి వాళ్లి నాన్న ఆరోగ్యం పూర్తిగా బాగుపడుతుంది. ఆయనే కూతుర్ని చదివించుకుంటాడు

నిత్యం యిలాంటి ఆలోచనలతోనే కాలం గడుపుతుంది జానకి

సంవత్సరన్నర గడిచింది కష్టాలు చెప్పిరావు వచ్చాక వాటికి అంతూ పంతూ వుండవు.

మదనపల్లినుండి టెలిగ్రాం వచ్చింది!

జానకి జీవితజ్యోతి ఆరిపోయింది! నొసటి కుంకుమ రాలిపోయింది! ఆమె ఎదోలనం మంటగలసింది!!

వెంకట్రావు మరణవార్త విన్న జానకి మొదలు నరికిన తరువులాగ పడిపోయింది! పెనవేసుకున్న వృక్షాన్నుండి విడదీసిన లతలాగ జానకి ప్రాణం రెపరెపలాడింది!

"అయ్యో! పాపం! జానకి!!" అన్నది లోకం

జానకి తలిదండ్రుల దుఃఖానికి అంతులేదు. మాతృహృదయంలోని రంపపుకోతను ఎన్ని కన్నీళ్లయినా తెలియ చెప్పలేవు.

వెంకట్రావు బంధుబలగం, జ్ఞాతులు అతని ఆత్మనిగురించి ఆలోచించారు. బతికుండగా ఒక్కళ్లూ సహాయం చేసినపాపాన పోలేదు. తల్లిదండ్రులు చిన్నప్పుడే దూరమైనారు.

వెంకట్రావుకు ఆస్తి యిస్తానన్న ముసలమ్మ యింకా రాయిలా బతికేవుంది. వెంకట్రావు కర్మకు ఖర్చు తనే పెట్టుకుంటానంది. బతికుండగా ఒక్క దమ్మిడీ యివ్వలేదు. ముసల్ది తొందరపడి ఆస్తి యివ్వనందుకు తనను తానే మెచ్చుకుంది అప్పుడే తనకు నీళ్లు వదలటానికి అర్హుడైన ఒక వారసునకు ఆశ పెట్టింది.

వెంకట్రావు పెదనాన్న మాధవయ్యకు కబురు పెట్టాడు కర్మ వెంకట్రావు సొంత వూరులో జరుగుతుందని.

కూతుర్ని తీసుకొని మాధవయ్య దంపతులు బయలుదేరారు.

మెల్లగా ఒక్కొక్కళ్లే బంధువులు, జ్ఞాతులు అంతా చేరుకున్నారు.

కర్మ పదిరోజులూ, శాస్త్రోక్తంగా జరిపించాడు వెంకట్రావు పెదనాన్న.

పదోరోజు! అదే జానకి ఐదోతనానికి ఆఖరురోజు - గుంజివస్త్రం చీరెకట్టి జానకిని సావిట్లో కూర్చోపెట్టారు. నొసటిమీద 'కాసు' అంత కుంకుమబొట్టు, చేతినిండా గాజులు, నున్నటి పచ్చటిమెడలో మెరుస్తున్న మాంగల్యం - ఆరిపోబోయే - ఆమె ఐదవతనం, అజ్యంపోసిన అగ్నిలా మెరుస్తోంది!

అలసిపోయిన ఆమె ముఖం ఏదో చెప్పలవికాని కొంత విషాదచ్ఛాయలను ప్రసరిస్తోంది.

శాంతమ్మ కూతుర్ని వళ్లో కూర్చోపెట్టుకొని గోడుగోడున ఏడుస్తోంది. జానకి చెక్కిళ్లపైన అశ్రువులు ధారాపాతంగా ప్రవహిస్తున్నాయి

వూళ్లోనుంచి ముత్తయిదువులంతా ఒక్కొక్కళ్లే వచ్చి చూసిపోతున్నారు. ఒక్కొక్కమ్మవచ్చినప్పుడల్లా సావిట్లోనుంచి పెద్దపెట్టున శోకాలు పాక్లోకూర్చున్న మగవాళ్ళకు వినవస్తున్నాయి

"ఆ వచ్చే ఆడవాళ్ళంతా ఒకేసారివస్తే పోలా?" అనుకున్నాడు వో ముసలాయన, దమ్ముపట్టిన లంకపొగాకు చుట్ట కాలక అవస్థపడుతూ.

చీకటి పడుతోంది

"అమ్మా చీకటి పడుతోందే!" అంటూ జానకి తల్లివడిలో తలదూర్చి ఆక్రోశించింది.

రాత్రి తొమ్మిదిగంట లవుతుంది. చూడవలసిన బంధువులంతా ఆఖరిముత్తయిదువు చూపును అందుకున్నారు.

ఇంకా కొన్ని గంటల్లో-జానకిమాంగల్యం మట్టిగలుస్తుంది. నొసటికుంకుమ చెరుగుతుంది. గాజులు ఘల్లున నేలరాల్తాయి. వన్నెచిన్నెలపువ్వుల చీరెలు దూరమౌతాయి. తుమ్మెదబారల్లావుండే ఆనొక్కులజుట్టులో యిక పూలుపెట్టుకొనే యోగ్యతలేదు.

ఎక్కడినించో జానకి చిన్న అన్న సత్యం ఒకస్నేహితునితో కలిసి అప్పుడే వచ్చాడు.

చిన్న అన్నయ్యనుచూసి జానకి భోరున ఏడ్చింది. సత్యం మనస్సు కకావికలయింది. చెల్లెలి దురవస్థచూసి ముఖానికి చేతులు అడ్డం పెట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చాడు.

రాత్రి పదిగంట లవుతోంది. పెదలంతా మధ్యహాల్లో మౌనంగా కూర్చున్నారు.

"ఏమిటోయ్ సత్యం! అంత చిన్న వయసులో వున్న ఆ అమ్మాయికి యీ ప్రారబ్ధం! యీ తతంగమంతా ఏమిటి?" అన్నాడు సత్యం స్నేహితుడు రామారావు.

L.T.S. 435-X52 TL

పెద్దలంతా విస్తుపోయి, కనురెప్పలు ఎత్తి చేసి రామారావుకేసి చూశారు.

"అనాదినుంచీ వస్తూన్న ఆచారం నాయనా! శాస్త్రాన్ని ధిక్కరించగలమా?" అన్నాడు వయోవృద్ధుడు, సనాతన ధర్మ పరాయణుడూ ఐన శివయ్యగారు.

"కాలం మారింది తాతగారూ! పోయిన వాళ్లే చిహ్నంగా బతికివున్న వాళ్లకి నరకాన్ని శాసించే మతసిద్ధాంతాల్ని ఎదిరించకపోతే ఎట్లా తాతగారూ?"

అంతా నిశ్శబ్దంగా వాళ్ల వాదన వింటున్నారు. "అది కాదు నాయనా! స్త్రీకి ఐదోతనం భర్తవల్ల సంక్రమించేదే కదూ? ఆ భర్తపోయాక యింకా ఐదోతనం వుండాలనటంలో అర్థం లేదు. ఆ భర్తతోపాటే అదీ పోవద్దూ? ఏమంటావు?" అన్నారు శివయ్యగారు.

"ఇంకా నయం భార్యకూడ పోవాలన్నారు గాదు! కొంతకాలం క్రిందట అదీ వుండనుకోండి! ఏదీ యిప్పుడలా జరుగుతోందా? మీ వాదనప్రకారం చూసినా స్త్రీకి వివాహంద్వారా వచ్చింది ఆ ఒక్క మాంగల్యాన్ని ధరించే హక్కేగదూ? పసుపూ కుంకుమా, పువ్వులూ చీరెలూ ధరించే హక్కు స్త్రీకి పుట్టుకవల్ల వచ్చింది కాదా?"

శివయ్య తాతగారికి కోపం వచ్చింది.

"మీ నాస్తికులతో వాదించి ప్రయోజనం లేదు" అన్నారు తాతగారు.

నవ్వి వూరుకున్నాడు రామారావు.

సత్యం వీధి అరుగుమీద కూర్చున్న పెద్ద అన్నయ్య దగ్గరకుపోయి అన్నాడు: "ఏమిటన్నయ్యా! నాన్నకు తెలియకపోతే నీకు తెలియలేదా? ఏమిటీ తతంగమంతాను? అసలు అమ్మాయిని యిక్కడికెందుకు తీసుకొచ్చారు?"

"నాకేం తెలుసురా? పెద్దవాడు ఆయనే చూసుకున్నాడు . అంతాను." పైపంచ దులుపుకుంటూ అన్నాడు సుబ్బారాయుడు.

తెల్లవారుఝాము. నాలుగు గంటలవుతుంది. కారుమబ్బుల్లోనుంచి నక్షత్రాలు తొంగిచూస్తున్నాయి. దూరంగా కుక్కల ఏడ్పు వినిపిస్తోంది.

హృదయాన్ని చీల్చిపోసే రోదన ఒక్కసారిగా విన్పించింది. స్త్రీ హృదయాన్ని బద్దలు చేసుకుంటూ వస్తున్న ఆ రోదనలో - స్త్రీ తన సౌందర్యాన్ని కాంతిని శాశ్వతంగా దూరమౌతూన్నప్పుడు పొందే దుఃఖం బాధా యిమిడివున్నాయి! ఆ స్త్రీ రోదన వింటే లక్షలాది మానవులు ఎగుగు తిరుగుతారు. బహుశా అందుకే ఆ తంతు రాత్రిపూట జరుగుతుందేమో?

జానకిని బండి ఎక్కించి వూరిబయటి చెరువుదగ్గరకు తీసుకెళ్లారు.

* * *

కర్మకాండ అంతా అయ్యాక జానకిని తీసుకొని మాధవయ్య దంపతులు సొంతవూరు వచ్చారు.

ఒకప్పుడు శ్రీలక్ష్మిలా యిల్లంతా కలయ తిరిగిన జానకి విధవై, ముల్లుపంచ కట్టుకొని యింట్లో మూలకూర్చుంది. శాంతమ్మ కూతుర్ని గురించిన దిగులుతో మంచమెక్కింది.

పాపం! మాధవయ్య, జానకమ్మలకు కష్టాలు కొండమీదనుంచి దొర్లే రాళ్లలా ఆరంభమయినాయి.

5

భూమి గిరగిరా తిరుగుతోనే వుంది. భూమిమీద కాలూని నిలవాలని జానకమ్మ ప్రతిక్షణం ప్రయత్నం చేస్తూనేవుంది.

పది సంవత్సరాలు జరిగాయి. అవే అదృష్టవంతులకు వేగంగా గడిచిపోయినై. జానకమ్మ ఆ పది సంవత్సరాలూ బరువు నెత్తుకున్న చీమనడక సాగించింది.

జానకమ్మ కూతురు పార్వతి పన్నెండేళ్లదయింది. శాంతమ్మ కాలగర్భంలో కలసిపోయింది. మాధవయ్య సరిగా నెలనాడే కూతురి కష్టాల్ని చూసే బాధనుండి విముక్తుడయాడు.

తలమునక నీళ్లలో యీతరాని బతుకయింది జానకమ్మది. తండ్రి ఎంత నికృష్ట పరిస్థితిలో చనిపోయాడో వూహించే ధైర్యం కూడా ఆమెకు లేదు.

వదిన కాంతమ్మ సూటిపోటి మాటలకు జానకమ్మ హృదయం తూట్లు పడిపోయింది. పొట్ట గడవటానికి చేసే పనికి కాళ్ళూ చేతులూ కాయలు కాచినయి.

సావిట్లో ఒక గదివార తడికలు కట్టుకొని కూతురితో కాలక్షేపం చేస్తూంది జానకమ్మ. సావిట్లో వుంటూ తన జీవితాన్ని తల్చుకొని అనుకోనేది తనే యిలా అనుకుంటే ఆ చిన్నమ్మ ఎలా కష్టపడిందో?

పిండి విసురుతూ సక్కుబాయి కష్టం ముందు తనెంత? లక్ష్మమ్మకంటే తనెక్కువ కష్టపడుతోందా? ఏవేవో పిచ్చిపిచ్చి వూహాలు జానకమ్మ మెదడులో కదిలేది.

కూతురు పార్వతి చదువు థర్డ్ ఫారంతో అంతమయింది. అంతవరకూ కూతురు చదువుకు డబ్బు పంపిస్తోన్న సత్యం అన్నయ్య జైల్లో పడ్డాడు. వాడి ఆస్తినంతా ముందే అమ్ముకొన్నాడు.

పెదన్నయ్య, సుబ్బారాయుడిదగ్గరకు పోయి అడిగింది జానకమ్మ "అన్నయ్యా యీసంవత్సరం పెల్ల నగుపు?"

మధ్యలో అందుకుంది కాంతమ్మ. "ఆం యింకేం చదువుల్లే! నెత్తిమీదకు పన్నెండేళ్లు వస్తేను."

"అది కాదు వదినా, స్కూలు ఫైనల్ దాకా అన్నా చెప్పిస్తే, దానికాళ్ళమీద అది నిలబడి దాని బతుకు అది బతక్కలిగితే చాలు."

"యింకా నయం! వూళ్లు ఏలిస్తాననన్నావు కాదు? అన్నట్టు మీ ఆయన బతికుండగా డాక్టరు చదివిస్తాననేవాడటగా?"

జానకమ్మ హృదయం బల్లెంతో గుచ్చి ఎత్తినట్లయింది. కాంతమ్మ యిలా హేళన చేయటం ఇది మొదటిసారిగాదు.

"అన్నయ్యా!" అన్నది జానకమ్మ.

అన్నయ్య పలకడు వులకడు! సుబ్బారాయుడిలోని 'అన్నయ్య' చచ్చిపోయి చాలా రోజులయిందన్న సంగతి జానకమ్మకు తెలియదు. ఆ సుబ్బారాయుడిలోని వ్యక్తిత్వం పెళ్ళాం ధాటికి తాళలేక ఏనాడో అంతరించిపోయింది.

"ఇంకేం చదువమ్మా పెళ్ళీడుకొస్తేను? ఎవర్నన్నా చూసి ముడేస్తే విరగడైపోతుంది! మీరయినా చెప్పకూడదండీ? మీ అమ్మాయికి తెలియకపోతే!" భర్తమీద వోక విసురు విసిరింది కాంతమ్మ.

సుబ్బారాయుడు పైపంచ దులుపుకుని భుజాన వేసుకొని బయటకెళ్ళాడు.

'అప్పుడే పార్వతికి పెళ్లా?' మథనపడింది జానకమ్మ.

"అవును! పెళ్లీడుకొచ్చిందిగా?" అంది లోకం. జానకమ్మ యిలా మథనపడుతూండగానే మూడు సంవత్సరాలు గడచిపోయినై.

ఇప్పుడు పార్వతికి పదిహేనో సంవత్సరం వచ్చింది. పెద్దమనిషయి ఇంట్లో కూర్చుంది. పిల్లకూడా ఏపుగా పెరిగింది.

కూతుర్ని పెద్ద చదువులు చదివించి డాక్టర్ని చేయాలనుకున్న వెంకట్రావూ జానకమ్మల కోర్కెలు మట్టిగలిసిపోయాయి. చదువు థర్డ్ ఫారంతో అంతమయింది. జానకి కలలు కళ్ళయిందే కరిగిపోయినయ్. ఒక్క జానకమ్మ రెక్కలకష్టంమీద రెండు పొట్టలు గడవటమే సమస్య అయిపోయింది. దానికితోడు పార్వతి పెళ్లి సమస్య జానకి గొంతుకు గాలంలా తగులుకుంది.

ఒకరోజు సాయంకాలం సుబ్బారాయుడుతో "అన్నయ్యా! పార్వతికి ఏదైనా మంచి సంబంధం వుంటే చూడు" అన్నది జానకమ్మ.

"సరే! చూద్దాం" అన్నాడు సుబ్బారాయుడు.

"ఇంకేం. అయితే! ఆ భద్రయ్యకిచ్చి చేయరాదూ?" అంది సుబ్బారాయుడు పెళ్లాం నాలుగోపిల్లడ్ని చంక నేసుకొని వచ్చి

"అగేమిటివదినా! అట్లాఅంటావు? ఆ ముసలాడికి ఎలా యివ్వమంటావు? చూస్తూ చూస్తూ నా బిడ్డగొంతు కోయమంటావా?" అన్నది జానకమ్మ వణికిపోతున్న కంఠంతో.

"నీదంతా వట్టి విడ్డూరమమ్మా! ముసలాడంటావేం? యింకా నలభై నిండినయ్యో లేదో? అంత ఆస్తిపరుడు నీ పిల్లనడిగాడంటే అంతా నీ అదృష్టమనుకో! కూటికీ గుడ్డకీ దిగులులేకుండా జరిగిపోతుంది. నీకూ పదికాలాలపాటు నీడ దొరుకుతుంది"

ఆఖరిమాటలు జానకమ్మ ఆత్మాభిమానం మీద దెబ్బతీసినయ్, కోపంగా అన్నది– "వదినా! నీ కెందుకమ్మా అంత చులకన?"

"మాశారా? మాశారా? అందుకే మంచికి పోతే చెడు ఎదురవుతుందట. నీ మంచికి చెబితే అంత కోప మెందుకమ్మా? అవును లే! నీకు గడపగడపా ఎక్కి పూడిగం చేసే రాతుంటే నా మాట లెందుకు చెవి కెక్కుతాయి"

"ఇక చాల్లే వదినా!" అంటూ జానకమ్మ గుడ్లనీరు గుడ్ల నింపుకొని తిరిగెళ్లింది.

అన్నయ్య ఉలకడు, పలకడు. బెల్లం కొట్టిన రాయిలా గోడ కానుకొని అలాగే కూర్చున్నాడు.

ఇంకో సంవత్సరం గడిచిపోయింది.

పార్వతికి పదహారు ఏళ్లు వచ్చినై. జానకమ్మ హృదయంలో అశాంతి, దిగులు గూడు కట్టుకుంటున్నాయి

"కూతురు పెళ్లి ఎప్పుడు చేస్తావు?"

"ఇంకా ఎంతకాల ముంచుతావమ్మా?"

"దమ్మిడీ యివ్వటం చేతగానివాళ్లకు ఇంద్రుడూ, చంద్రుడూ ఎక్కణ్నుంచి వస్తాడమ్మా?" "బుద్ధులు భూము లేలుతుంటే రాతలు గాడిదలు కాస్తున్నాయట!" "లక్షణంగా భద్రయ్య కిచ్చి సుఖపడకా!" ఇలా వొకటే కాకిగోల.

లోకం చేసే ఈ కాకిగోల అహర్నిశలు జానకమ్మ చెవుల్లో గింగురుమంటూనే వుంది.

"ఏం అన్నయ్యా! పార్వతి పెళ్ళి మాటేం?" అన్నయ్య నడిగింది జానకమ్మ

"ఎక్కడొస్తారమ్మా! ఆ భద్రయ్య కిస్తేనే బాగుంటుం దనుకుంటాను"

"అన్నయ్యా —"

ఎవరిమీదనో ఏదో తెలియని కసి జానకమ్మ అంతరాళంలో పెరుగుతూ వచ్చింది దానికి కట్టలు తెగిపోయినయ్ తను యిక అంత పని చేస్తుంది!

జానకమ్మకు చిన్నన్నయ్య తలపుకు రాగానే దుఃఖం పొర్లుకు వచ్చింది

"ఎవర్ని వుద్ధరించటానికని యీ దీక్ష? నీ మేనకోడలూ చెల్లెలూ యింత అన్యాయం అయిపోతుంటేను!" అనుకుంది జానకమ్మ.

జానకమ్మ పైట చెంగుతో కళ్లు తుడుచుకొని భద్రయ్య గారింటికి కబురు చేసింది

6

భద్రయ్య తరలివచ్చి పార్వతిని పెళ్లి చేసుకున్నాడు.

పెళ్లి జరుగుతున్నంతసేపూ జానకమ్మ వొకంట నీరు కారుస్తూనే వుంది, కూతురుకు పట్టిన దుర్దశనూ, భర్తనూ, తల్చుకొని. తనూ, ఆయనా కలసి పార్వతినిగురించి ఎన్ని కలలు కన్నారు? ఎన్ని ఊహాసౌధాలు నిర్మించుకున్నారు? కళ్ళు కుళ్ళి ఏడ్చింది జానకమ్మ.

"వూరుకో జానకమ్మా యిష్టమయి ఇచ్చుకున్నాక, అంతా అయినాక ఏడవటం దేనికి? అల్లుడు కూతురు పదికాలాలపాటు బాగుండాలనుకోక!" జానకమ్మను ఓదార్చింది యిద్దరు ఆడపిల్లల తల్లి వొకావిడ.

ఆరు నెలలు గడిచిపోయినై. చీకటినీ వెలుతుర్నీ మేస్తూ కాలం సాగిపోతోంది.

పార్వతి కాపరానికి వెళ్లింది కూతుర్ని కనిపెట్టుకొని జానకమ్మ అల్లుడింట్లోనే వుంది.

అల్లుడింట్లో జానకమ్మకు అనుకున్న దానికంటే హాయిగా కాలం గడిచిపోతోంది

మళ్ళీ ఇన్నాళ్ళకు కాళ్లకు భూమిమీద పట్టు చిక్కినట్లయింది. చేతి కింత ఆసరా దొరికినట్లుంది.

వేళ కింత తిండీ, కట్టుకోవటానికి రెండు జతలు పంచెలూ దొరుకుతున్నయ్ అంతకంటే తనకేం కావాలి? భద్రయ్య పాతిక ఎకరాలదాకా వున్న ఆసామి పెద్ద లోగిలీ వుంది. సొంత వ్యవసాయం చేయించుకుంటూ వుంటాడు ఆవుపాటి పొట్టా అదీ మనిషి వికారంగా వుంటాడని చెప్పాలి. మొదటిభార్య కొడుకు సూర్యనారాయణకు ఇరవయి సంవత్సరాలుంటాయి పట్నంలో బి. ఏ చదువుతున్నాడు

వేసవికాలం సెలవలకు వచ్చి రెండు నెల్లు వుండి వెళ్ళాడు. పార్వతంటే ఆదరం, కలుపుగోలుతనం చూపేవాడు.

వంటింట్లో పెత్తనమంతా జానకమ్మదే. ఇప్పుడు జానకమ్మ చేసేపని వంట మినహా యింకేమీ లేదు.

ఇప్పుడప్పుడు అల్లుడికి అన్నం తనే వడ్డిస్తుంది. అలుడూ కలుపుగోలుతనంగానే మాట్లాడుతున్నాడు తను బిడియం లేకుండానే భద్రయ్యతో మాట్లాడుతోంది.

అత్తగారిదగ్గర భద్రయ్య బాగా చనువు తీసుకున్నాడు

అప్పుడప్పుడూ భద్రయ్య ప్రవర్తనకు జానకమ్మ మనస్సు చివుక్కుమనేది. అయినా అల్లుడేగా, ఒకమాట అనతగడా అనుకొనేది. తను ఎలా అయితే ఏం? కూతుర్ని సరిగా చూస్తే చాలు తనకు అంతకంటే యింకేం కావాలి?

రాత్రిపూట అన్నం వడ్డిస్తుంటే భద్రయ్య ఆమెకళ్లలోకి అదోరకంగా చూసేవాడు తిన్న అన్నమంతా ఏమయేదో తనవైపు ఆకలిగా చూసేవాడు. ఆ అసహ్యమైన చూపులకు ఆమెకు వంటిమీద తేళ్లు పాకినట్లుండేది.

మనిషితరహా యింతేనేమోనని సర్ది చెప్పుకొనేది. ఏమైనా అల్లుడు. తన కూతురు సౌఖ్యంకంటే తనకు కావాల్సిం దేముంది?

ఒకరోజు రాత్రి . వంటింట్లో అల్లుడు తిన్న అన్నం పళ్లెం జానకమ్మ వంగితీస్తోంది పైట చెంగు ఎవరో గట్టిగా గుంజారు జానకమ్మ తత్తరపోయి వెనక్కు తిరిగిచూసింది. భద్రయ్య!

జానకమ్మవళ్లు జలదరించింది! 'ఛీ' అంటూ తోకతొక్కిన తాచులా లేచింది రోషంతో రక్తం కుతకుతలాడింది భద్రయ్యనుచూసి గోడకానించివున్న పీటనుతీసి రెండుచేతుల్లోనూ పట్టుకుంది ఒక్కక్షణం తటపటాయించి ఎత్తి కిందవున్న పళ్లెంమీదకువిసరింది.

'ఖంగ్'మని పళ్లెం మోగింది.

ఖంగారుగా భద్రయ్య బైటకిపరుగెత్తాడు. భద్రయ్య పార్వతి మొగుడు కాకపోతే ఆపీట ముఖానికే విసిరికొట్టి ఉండేది.

తెల్లారి జానకమ్మ గుడ్డలు సర్దుకుని ప్రయాణమైంది "ఇప్పు డెక్కడికమ్మా నీ ప్రయాణం? అసలు ఎందుకే వెళ్ళటం?" అన్నది పార్వతి.

"కాదు లేమ్మా! వెళతాను!" కళ్లవెంట నీరు తిరిగినయ్ జానక్కి.

"అసలుసంగతేమిటే అమ్మా?" అన్నది పార్వతి ఆదుర్దాగా.

జానకమ్మకొచ్చినకష్టం ఒకరికి చెప్పేదా? అందులోనూ కూతురికి ఏమని చెబుతుంది?

"అమ్మా నీవెళితే నేనూ వస్తాను. నువ్వు లేకపోతే ఒక్కక్షణం ఇక్కడుండను" బెంగగా జాలిగా అన్నది పార్వతి.

గుడ్డల మూట లోపల పెట్టింది జానకమ్మ. తన కూతురు సంసారం బాగుంటే చాలు. తను ఎన్ని బాధలైనా సహిస్తుంది.

జానకమ్మకు అల్లుడింట్లో యమలోకపు తెరలు తెచినయ్!

"నా సొమ్ము తినేసరికి నీక్కూడా వళ్లు బలిసింది" అన్నాడు భద్రయ్య కుక్కను కాలితో తన్నుతూ, జానకమ్మను వోరగా చూసి

కుక్కమీద పిల్లిమీద పెట్టి ఎత్తిపొడుపు మాటలు జానకమ్మను ఏరోజూ అంటూనే వున్నాడు. ఆమె అన్నీ భరించి తలవంచుకొని తిరుగుతూనే వుంది

ఒకరోజు వట్టి పుణ్యానికి పార్వతిని కొట్టాడు భద్రయ్య. ఆ కోపం అంతా తన మీదనే అని జానకమ్మకూ తెలుసు. అయినా ఏం చేయగలదు?

జానకమ్మ పని అడకత్తెరలోని పోకచెక్కలా అయింది. ఒకవైపు కూతురి సంసారం, మరోవైపు తన శీలం

★ ఆమె - లోకం ★

పార్వతికి మొగుడంటే ఇష్టమో అయిష్టమో ఏదీవున్నట్లు తోచదు డబ్బు దొరికినంతవరకూ చీరలుకొనడం, చిత్తరకం పుస్తకాలన్నీ కొని చదవటం మినహా యితర ప్రపంచంతో సంబంధంవున్నట్లే కన్పించదు.

సెప్టెంబరు సెలవలకు సూర్యనారాయణ ఇంటికివచ్చాడు అతడొచ్చాక జానకమ్మకు కొంత మనశ్శాంతి కలిగినట్లయింది భద్రయ్య పోరు తగ్గింది కొడుకు వచ్చిన దగ్గర్నుంచీ యిన్ని మెతుకులు నోట్లోవేసుకొని పొలంపోయి రాత్రికిగాని యింటికి వచ్చేవాడుకాడు. సూర్యనారాయణతనంటే ఎంతో గౌరవం చూపుతాడు.

కాని ఒకరోజున—

ఓరవాకిలిగా వేసివున్న తలుపు తోసుకొని జానకమ్మ కూతురు గదిలోకి చూసింది

జానకమ్మ తన కళ్లను తానే నమ్మలేకపోయింది! కాళ్లకింద భూమి కదలిపోయింది!! తనేం చూస్తోంది?

సూర్యనారాయణ—

గిర్రున వెనక్కి తిరిగింది కాళ్లు తేలిపోతున్నాయి. తనకు మతి చలించిపోతోంది పార్వతి తన కూతురు, యింత పాపానికి వొడికడుతుందా? ఛండాలుడు? సూర్యనారాయణ! ఛీ వాళ్ళవంశమేయింతా? అయితే తన కన్నకూతురు పార్వతి—

జానకమ్మ శరీరం దహించుకపోతూంది

"పార్వతీ!" ఆడపులిలా గాండ్రించింది జానకమ్మ

"అమ్మా వస్తున్నా!" పార్వతి పరుగెత్తుకుంటూ వచ్చింది

"ఛీ పాపిష్టిదానా! నా కడుపున చెడపుట్టావు?" పార్వతి చెంపమీద ఛెళ్లున కొట్టింది తల్లి.

"యీ నీచపు బ్రతుకు బ్రతక్కపోతే నేం? పార్వతి నిశ్చేష్టురాలై నిల్చుంది

"ఛీ, నీముఖం చూపించకు! నీవు నా కూతురివి కావు నీకు నేను తల్లినికాను!" జానకమ్మ రయిన వెళ్లిపోయింది.

సావిట్లో మంచంవాల్చుకునికూర్చునిముఖానికి చేతులడ్డం పెట్టుకొనికుమిలికుమిలిఏడ్చింది

పార్వతికి కళ్లు మసకలు కమ్మిపోయినయ్. ఆమెశరీరం ఆమెకే బరువుగా తోచింది గది తలుపులు బిగించుకొని మంచంమీద పడుకొని వెక్కి వెక్కి ఏడ్చింది శరీరం కంపించిపోతోంది. తనమీద తనకే అసహ్యం కలిగింది

"ఛీ! ఆపాడు బ్రతుకు బ్రతక్కపోతే నేం?" తనతల్లేనా ఆమాటలన్నది? అష్టకష్టాలూపడి తనను పెంచి పెద్దదాన్ని చేసిన అమ్మేనా అలా అనటం? తనకోసం తన జీవితమంతా యీయింట్లో వూడిగం చేయటానికి సిద్ధపడిన తల్లేనా? పార్వతికి అభిమానం రోషం పెనవేసుకొచ్చాయి. గుండె రాయిచేసుకుంది

"ఛీ యీనీచపు బ్రతుకు బ్రతక్కపోతే నేం!" ఎవరో చెవులో అరుస్తున్నట్టుగావుంది!

ఆరాత్రి జానకమ్మకు నిద్రపట్టలేదు. బుర్ర పగిలిపోయే ఆలోచనలు.

పార్వతిని ఎందుకు కొట్టింది? తను ఎందుకింత తొందరపడింది? చిన్నతనం, ఏదో తెలియక చేసింది ముసలాడికిచ్చి పార్వతిని చేయటం తన తప్పు కాదా? కోపంతో ఏమేమో అన్నది తన చిట్టితల్లి ఎంత బాధపడిందో? తను బుజ్జగించి చెబితే పార్వతి వినేదికాదా? తన చేతులతో పార్వతిని ముసలాడికిచ్చి గొంతుకోసింది. తను యింత తిండి దొరుకుతుందని పార్వతిని అన్యాయం చేసిందా? తన భర్త పార్వతిని గురించి ఎన్ని కలలు కన్నాడు? కుళ్లికుళ్లి ఏడ్చింది జానకి

పార్వతినిగురించిన బాధతో జానకమ్మ నిద్రలోకి జారిపోయింది రాత్రంతా పీడకలలు!

తెల్లవారుతోంది. పని మనిషి ఏడుపూ, జనం అరుపులూ గోలగా వినపడుతున్నాయి! జానకమ్మ త్రుళ్లిపడి లేచింది.

పార్వతి శవాన్ని అప్పుడే భావిలోనుంచి తీస్తున్నారు! జానకమ్మ గుండె బాదుకుంటూ పోయి బావిఒడ్డున పడుకోపెట్టిన పార్వతి శవంమీద వాలిపోయింది

సూర్యుడస్తమించబోతున్నాడు. కబురువిని సుబ్బారాయుడు, కాంతమ్మ, రామదాసూ వచ్చారు భద్రయ్య తరపు బంధువులుకూడ వచ్చారు

పార్వతి పాడెపై ముత్తైదువులు పసుపు కుంకం చల్లారు కూతురి శవంమీదపడి జానకమ్మ గోడుగోడున ఏడ్చింది ఆమె ముఖానికీ శరీరానికి పార్వతిపైన చల్లిన పసుపూ కుంకుమా అలుముకున్నాయి

చీకటపడింది

భద్రయ్య యింట్లో యిప్పుడు పార్వతి కూడ లేదు రాత్రి పన్నెండు గంటలవుతోంది. కారుమబ్బులు కమ్ముకున్నాయి. జల్లుగా చినుకులు పడుతున్నాయి జానకమ్మను వోదార్చటానికి కూర్చున్నవాళ్లంతా నిద్రపోతున్నారు

జానకమ్మ మెల్లగా లేచి నిల్చుంది. వూరికివుత్తరాన శ్మశానందగ్గరకు వెళ్ళింది. పార్వతి చితి గనగన మండుతోంది! మంటలు మెల్లగా ఆరి మసిఅవుతోంది

దూరంగా నుంచొని కళ్లార్పకుండా చూసింది జానకమ్మ

తన ఆశాజ్యోతి పార్వతి కాలి మసి అయిపోతున్నది ఇంక యీ లోకంలో తనకు పనేమిటి? ఎక్కడికి పోతోంది? అల్లుడింటికా? అన్నయ్య యింటికా?

ఇక తన బ్రతుక్కి అర్థం ఏమిటి? ఇంకా జానకికి ముప్పయి మూడేళ్లు నిండలేదు జీవితంలో మూడో వంతు జరగలేదు. కాని మూడు జన్మల బాధ లనుభవించింది. మూడు తరాల కష్టాలు పంచుకొంది.

ఆ చీకట్లో ఆరిపోతున్న పార్వతి చితిని చూస్తూ జానకి అలా ఎంతసేపు ఆ స్మశాన వాటికలో నుంచుందో? ★

చర్మపు బాధల కన్నిటికి

"సైబాల్"

చర్మవ్యాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాళ్లిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుగుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబి గ్రైప్"

తయారీదార్లు

దిసౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు

సీతారామ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి.